# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ తిరుమల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీవెంకటేశ్వర స్వామి వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.
- ❖ దేశంలో ఆంధ్రప్రదేశ్ ను అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.
- ❖ తిరుమల ప్రసాదం కల్తీ ఆరోపణలపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు ఐదుగురు సభ్యులతో కూడిన సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.
- ❖ ఖరీఫ్ లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకూండ చర్యలు చేపట్టాలని మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు.

=========================

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా తిరుమలకు బయలుదేరారు. రాత్రికి తిరుమలలో బస చేసి, రేపు పెద్ద శేష వాహనంలో స్వామి వారి ఉత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం అమరావతికి తిరిగి పయనమవుతారు. ముఖ్యమంత్రి తిరుమల పర్యటన నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

=========================

దేశంలో ఆంధ్రప్రదేశ్ ను అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. ఈరోజు సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో స్వర్ణాంధ్ర - 2047 జిల్లా విజన్ ప్రణాళికపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ... రాబోయే కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి చేపట్టాలని, దీనిలో భాగంగా జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళికలను అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని అన్నారు. అందుకు

అనుగుణంగా అన్ని శాఖల అధికారులు, నియోజక వర్గాల వారీగా శాసనసభ్యులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అలాగే నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించేలా పలు కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. త్వరలోనే నియోజక వర్గంలో ఖాదీ బోర్డు రుణాల సద్వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

========================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి ఆరోపణలపై సుప్రీం కోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీనిలో ఇద్దరు సిబిఐ అధికారులు, ఇద్దరు ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారులు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) ఉన్నత అధికారి సభ్యులుగా ఉండాలని సూచించింది. స్వతంత్ర సిట్ దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని తెలిపింది. కోట్లాది భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది. కాగా తిరుమల లడ్డూ వివాదంపై స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

========================

''ఆంధ్రప్రదేశ్ కి సంబంధించి 73 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ వెల్లడించారు. రాష్ట్రంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పి. నాగరాజులు ఈరోజు విజయవాడలో సమావేశమయ్యారు. అనంతరం కేశినేని శివనాథ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో వున్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయటమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించామని అన్నారు. ముఖ్యంగా ఆర్.వో.బిలు, రైల్వే అండర్ బ్రిడ్జ్ లు, కొత్త రైల్వే లైన్లు, కొత్త రైళ్లు వంటి ప్రతిపాదనలపై చర్చించామని, అమరావతి రైల్వే లైన్ కు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయని, త్వరలో రైల్వే లైన్ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అలాగే రాజధానికి కొత్త రైళ్లు, వందే భారత్ ఎక్స్ ప్రెస్ లు కావాలని అడగ్గా రైల్వే అధికారులు అందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

========================

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా శాస్త్ర, సాంకేతిక వేడుకలు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు షార్ డైరెక్టర్ ఎ. రాజరాజన్ తెలిపారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1999లో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ప్రతి ఏటా అక్టోబర్ 4 నుండి 10వ తేదీ వరకు నిర్వహించాలని ప్రకటించింది. ఈ మేరకు ఈరోజు శ్రీహరికోటలో జరిగిన ప్రారంభోత్సవంతో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.

========================

రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శాసన సభ్యులతో కలసి విజన్ స్వర్ణాంధ్ర-2047పై అభిప్రాయ సేకరణకు కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2020 విజన్ డాక్యుమెంట్ వల్లనే అప్పటి ఉమ్మడి రాజధాని హైదరాబాద్ అభివృద్ధి చెందిందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న రైతులు, విద్యార్థులు, వ్యాపార వేత్తలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు నుండి అభిప్రాయాలు సేకరించాలని తెలిపారు. జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవన శాఖల ద్వారా అభివృద్ధి సాధించవచ్చని, వ్యవసాయానికి శత శాతం డ్రోన్ల వినియోగాన్ని పెంచుకోవాలని సూచించారు. మూలపేట పోర్టుకు వచ్చే జూన్ 12 నాటికి ఒక ఓడ వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు.

విరామం

=========================

ఖరీఫ్ లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకూండ చర్యలు చేపట్టాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి స్పష్టం చేశారు. ఈరోజు ఏలూరులో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, ట్రాన్స్ పోర్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు కొనుగోలు విషయంలో రైస్ మిల్లును సంప్రదించవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతులు గోనెసంచులు, హమాలీలు, రవాణాను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ పైకం నేరుగా రైతు ఖాతాలోకి ధాన్యం సొమ్ముతో సహా చెల్లించబడుతుందని మంత్రి స్పష్టం చేశారు.

=========================

విశాఖజిల్లాలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ ఈరోజు విడుదల చేసిన వార్షిక రుణ ప్రణాళికలో 7 వేల 108 కోట్ల రూపాయలతో పెద్ద పీట వేశారు. విశాఖ కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులు బ్యాంకర్ల సమక్షంలో 63 వేల 266.10 కోట్ల రూపాయలతో వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. దీనిపై మరింత సమాచారాన్ని ఆకాశవాణి విశాఖపట్నం ప్రతినిధి మూర్తి అందిస్తారు.

(వాయిస్ 20 సెకన్లు)

=========================

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 2వ రోజు కనకదుర్గ అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిస్తున్నారు. పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్ఠాన దేవతగా భక్తులు అమ్మవారిని కొలుస్తారు. సకల మంత్రాలకు, వేదాలకు మూలమైన దేవతగా గాయత్రీదేవి ప్రసిద్ధి. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హరినాథ్, జస్టిస్ దుర్గాప్రసాద్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, సీపీ రాజశేఖర్‌బాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

=========================

“వన్ దన్ వికాస్ కేంద్రాల” ద్వారా గిరిజనులు ఉత్పత్తి చేసిన వస్తువులకు ప్రాచుర్యం కల్పించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆ దిశగా గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. జిల్లాలోని వన్ దన్ వికాస్ కేంద్రాల పనితీరుపై కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని వన్ దన్ వికాస్ కేంద్రాలన్నీ బాగా పని చేయాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో ఒక మోడల్ వన్ దన్ వికాస్ కేంద్రం ఉండేలా చూడాలని సూచించారు. గిరిజనులు పండించిన పంటలకు అదనపు ఆదాయం సమకూరాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

=========================

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఈరోజు పశ్చిమ గోదావరి జిల్లా సమిశ్రగూడెంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి... ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల

అమలు తీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులంతా సమన్వయంతో పని చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయాలని సూచించారు.

=========================

=========================